జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 18-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 675 పేజీలు: 4 వెల : రూ.7

## రౌడీషీటర్లకు..
# పోలీస్ వార్నింగ్




- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
- నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి
- సత్ప్రవర్తనతో మెలగాలి
- నేర ప్రవర్తన కలిగిన వారిపై ప్రత్యేక నిఘా
- జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్
- ఎస్పీ ఆదేశాలతో ప్రతి ఆదివారం ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ

శ్రీకాకుళం క్రైం, మే 17 (వార్త): శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు పోలీసులు తమదైన శైలిలో వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్లకు స్టేషన్ అధికారులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో జీవనం సాగించాలన్నారు. పోలీసుల సూచనలు, ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అనవసర ఘర్షణలు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలను విడిచిపెట్టి, మంచి నడవడికతో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనరాదన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు లేదా ఇతర నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరించారు.









## వితంతువులకు భరోసా!



- జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు
- గత ఐదేళ్లలో అటకెక్కిన ఎత్తిపోతల పథకాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- నిమ్మాడలో ప్రజాదర్బార్

3లో

## సీఎం పర్యటనలో.. జిల్లాకు వరాలేవి?

- మోసగించడంతో చంద్రబాబు దిట్ట
- వైసీపీని విమర్శించడమే అతని పని
- రైతు సమస్యలపై స్పందించని ప్రభుత్వం
- సీఎం పర్యటన అట్టర్ ఫ్లాప్
- అంతా ప్రచార ఆర్భాటమే
- వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్


3లో



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ఆదిత్యుని అన్నదాన పథకానికి లక్ష విరాళం



**అరసవల్లి, మే 17 (వార్త):** సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శాశ్వత అన్నదాన పథకానికి గాను విశాఖపట్నం వాస్తవ్యులు ఎంజీకే కుమారి పేరున కుమారుడు రాజభూషణ్ ఆదివారం లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌కు అందజేశారు. తదుపరి వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.7,36,600, పూజలు, విరాళాల రూపంలో రూ.68,104, ప్రసాదాల రూపంలో రూ.2,52,785, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు మరియు ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా మొత్తం రూపంలో రూ.54,640లు ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

## బాబురావు కుటుంబానికి అండగా ఉంటాం
### పాతపట్నం ఏఎంసి చైర్మన్ ప్రతినిధి దినకర్



**మెళియాపుట్టి, మే 17 (వార్త):** ఉపాధి హామీ పథకంలో పని చేస్తూ ప్రమాదానికి గురైన వేతనదారు సవర బాబురావు, ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని గిరిజన సంఘ నాయకులు, పాతపట్నం ఏఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్ తెలిపారు. మెళియాపుట్టి మండలం, కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోనున్న పాత్రలోవ గ్రామానికి చెందిన సవర బాబురావు ఇటీవల కాలంలో ఉపాధి హామీ పనికి వెళ్లి ప్రమాదానికి గురి గాయపడ్డారు గాయాల పాలైన బాబురావును జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేతనదారు బాబురావుకు గాయాలైన విషయం తెలుసుకొని గిరిజన సంఘ నాయకులు, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి దినకర్ జిల్లా ఆసుపత్రికి వెళ్లి బాబురావును పరామర్శించి ప్రమాదం ఎలా జరిగింది తదితర వివరాలు అడిగి తెలుసుకుని అధైర్య పడవద్దని సకాలంలోనే ఆరోగ్యం కుదుటపడుతుందని భరోసానిచ్చి, కుటుంబీకులకు ధైర్యాన్ని అందించారు. ఆయన వెంట షణ్ముఖరావు తదితరులున్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ నర్తు జన్మదిన వేడుకలు



**కంచిలి, మే 17 (వార్త):** స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు జన్మదిన వేడుకలు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులకు మధ్య కవిటి మండలం కొత్త పుట్టుక గ్రామంలో తన స్వగృహం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఇచ్ఛాపురం వైసిపి సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి జడ్పిటిసి ఇప్పిలి లోలాక్షి పద్మావతి ప్రకాష్ ఇచ్ఛాపురం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఇచ్ఛాపురం మండల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా కంచిలలో రాధాకృష్ణ ఆలయం వద్ద పార్టీ నేతలు అభిమానులు కేక్ కట్ చేసి రామారావును సాలువతో సత్కరించారు. కంచిలి రైల్వే స్టేషన్ లో ఎంపీపీ దేవదాసు రెడ్డి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ దాసు జన్మదిన వేడుకలకు హాజరై దుస్సాలులతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

## సాకేత్ పండాకు సీఎం సహాయనిధి




**సోంపేట, మే 17 (వార్త):** పొత్రఖండ గ్రామానికి చెందిన సాకేత్ పండా అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పొంద డంతో ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ చేతుల మీదుగా ఆదివారం 85695 రూపాయల చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మద్దిల నాగేశ్వరరావు బేసి కిషోర్ గోకర్ల ఈశ్వరరావు చిత్రాల శ్రీనివాసరావు మల్ల కోదండరావు మడ్డు బుద్దేష్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్లో ఖోఖో సమ్మర్ క్యాంప్

**ఇచ్ఛాపురం, మే 17 (వార్త):** కాదా లక్ష్మీకాంతమ్మ మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాల ఆవరణంలో బాలికలకు గవర్నమెంట్ నిర్వహిస్తున్నటువంటి ఉచిత వేసవి శిక్షణ శిబిరం లో భాగంగా పిల్లలకి ఫ్రెండ్లీ ఖో ఖో మ్యాచ్ ఆడించారు. ఉచిత వేసవి శిక్షణ శిబిరం లో పిల్లలకి మంచి ఆహారమును డొనేట్ చేసారు.ప్రముఖ బంగారం వ్యాపార వేత్త శాసన పూరి ప్రదీప్ శిరీష దంపతులు మూడు రోజులకు సరిపడినటువంటి ఫుడ్ బిస్కెట్స్ అరటి పళ్ళు అందించారు. పాఠశాల విద్యార్థిని మధుశ్రీ తల్లిదండ్రులు పిల్లలకి ఈరోజు గుడ్డు, పాలు, బ్రెడ్ డొనేట్ చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బల్ల శ్రీనివాసరావు , పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గిన్ని వెంకట్ రమణ పాఠశాల కో ఆప్షన్ సభ్యులు కృష్ణయ్య , తల్లిదండ్రులు రెయ్య నారాయణస్వామి , పాఠశాల ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు. పిల్లలు టీవీలకి సెల్ఫోన్లకి అంకితం అయిపోతున్న కారణంగా ఇలా వేసవి సెలవులలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం వలన పిల్లలుకు శారీరక శ్రమ అనేది చేయడం వలన వాళ్ళ శారీరకంగా మానసికంగా ఎదగడానికి ,క్రమశిక్షణ గా, ఆరోగ్యవంతులుగా ఉండడానికి ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిని మీరందరూ కూడా సద్వినియోగం చేసుకొని మంచి నైపుణ్యాన్ని నేర్చుకొని రాబోయే క్రీడల్లో మంచి మంచి ఉన్నత స్థానాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలియజేశారు. పిల్లలందరినీ అభినందించడం జరిగింది. ఉపాధ్యాయులకు అలాగే తల్లిదండ్రులకు మాకు శిక్షణ శిబిరాలకు వెన్నుదన్నుగా నిలబడినటువంటి అందరికీ గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.




# పూర్వ విద్యార్థులు అపురూప కలయిక

- దశాబ్దాల తర్వాత కలుసుకున్న మధుర క్షణాలు
- ఉపాధ్యాయులకు సన్మానం



**మెళియాపుట్టి మే17 (వార్త):** మండలంలో గల కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేర్వేరు గ్రామాల నుండి నుండి వచ్చి ఒక దగ్గర చదువుకొని రెండు దశాబ్దాల తరువాత మళ్లీ వారంతా మర్రిపాడు గ్రామానికి దగ్గరలో ఉన్న లక్ష్మీ కల్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమం తెలుసుకొన్నారు. వివరాల్లోకి వెళ్తే 1996- 1997 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన మొట్టమొదటి బ్యాచ్ వారు కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. నాడు కలిసి ఒకే దగ్గర చదువుకున్న విద్యార్థులు నేడు ఉద్యోగ, వ్యాపార, తదితర వ్యవహారాలు నిర్వహిస్తూ ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని తాము చదువుకున్న రోజులనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూనే ప్రస్తుతం తాము ఏం చేస్తున్నది, ఎక్కడున్నది, తదితర యోగక్షేమాలను తెలుసుకుంటూనే మిగతా కార్యక్రమాన్ని చేపట్టారు. నాడు చదువు చెప్పిన లింగాల సంజీవరావు మాస్టారు, పి బలరాం నాయుడు మాస్టారు, జి జగన్నాథం నాయుడు మాస్టారు, టీ. ఆనందరావు మాస్టారు, ఎస్. జయలక్ష్మి ఉపాధ్యాయిని తదితర గురువులను సైతం ఈ కార్యక్రమానికి పిలిచి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల జీవితాల్లో దిశానిర్దేశం చేసిన గురువుల బోధనలకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు చూపిన చొరవ తమకు ఉపాధి, జీవన మార్గాన్ని చూపిందని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గురువుల పాత్ర అనిర్వచనీయమని, స్నేహభావం, అనుబంధం, కృతజ్ఞతలతో నిండిన ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థులందరికీ మరపురాని అనుభూతిని అందించిందని పూర్వ విద్యార్థులు బొచ్చు ప్రసాదరావు, పెద్దింటి రమేష్ బాబు, లండ ఖగేశ్వరరావు, రేఖాన స్వాతిబిందు, సోనాపురం జానకి, బొమ్మన సునీత, దీర్ఘాసి రామకృష్ణ, దేవరభద్ర ధర్మారావు, సలాన గౌరీ, జొన్న సునీతలతో పాటు 40 మంది పూర్వ విద్యార్థులు, వారి కుటుంబీకులు, ఉపాధ్యాయులు స్నేహితులు తదితర పూర్వ విద్యార్థులున్నారు.

## 42 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు..!

**నరసన్నపేట, మే 17(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకుని ఆనందంగా గడిపారు. ఆదివారం స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ ఆత్మీయ సమావేశం హర్షాతిరేక వాతావరణంలో సాగింది. ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువుకున్న రోజుల అనుభవాలు, పాఠశాల సంఘటనలు, స్నేహితులతో గడిపిన క్షణాలను నెమరువేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. అలాగే ప్రస్తుతం తమ కుటుంబ పరిస్థితులు, ఉద్యోగాలు, ఆరోగ్య విషయాలను పరస్పరం తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం పాత మిత్రబంధాలను మరింత బలపరిచిందని పాల్గొన్న వారు ఆనందం వ్యక్తం చేశారు.





## అపూర్వ సమ్మేళనం

**ఇచ్ఛాపురంం మే 17 (వార్త):** రత్తకన్న మున్సిపల్ హై స్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు .2003- 2004 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.నాటి జ్ఞాపకాలను,నేటి పరిస్థితులను ఒకరుకొకరు చెప్పుకొని ఆనందం పొందారు నాటి కాలంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల సేవలను స్మరించుకుంటూ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువులు అందించిన విద్య, విలువలే నేటికీ ఈ స్థితికి కారణమని చర్చించుకున్నారు. తదుపరి గురువులను సత్కరించి వారు ఆశీస్సులు అందుకున్నారు.అప్పటి ఉపాధ్యాయులు డబ్బిరు ధనలక్ష్మి, ఫాల్గుణ రావు, కృష్ణ మూర్తి లోకేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# నాపై తప్పుడు ఆరోపణలు

- కొత్తరోడ్డులో నాకు అంగుళం భూమి ఉన్నా నిరూపించండి
- బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు నేను భయపడను
- అక్కివరం రైతులు, కొత్తపేట భవన నిర్మాణదారులకు అండగా ఉంటా
- స్థానికుల వినతుల మేరకే రోడ్లు వేశాం
- మిగులు నిధులతో సీసీ రోడ్లు, కాలువలు వేస్తాం
- నీటి సదుపాయం కూడా కల్పిస్తా
- మఠం భూముల్లో అక్రమాలు ఉంటే నిర్వాహకులు చూసుకుంటారు
- ఎమ్మెల్యే కూన రవికుమార్



శ్రీకాకుళం/ఆమదాలవలస, మే 17 (వార్త): కొత్త రోడ్డు ప్రాంత భూముల విషయంలో నాపై కొందరు వైసీపీ నాయకులు చేస్తున్న ఆధారాలు లేని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. వైసిపి పాలనలో జరిగిన బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, రియల్ ఎస్టేట్ దందాలు, రైతులపై బెదిరింపుల రాజకీయాలపై ఆయన ఘాటుగా స్పందించారు. కొత్తరోడ్డు జంక్షన్‌లోని వెంకటేశ్వర కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియాలో సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కొత్తరోడ్డు జంక్షన్, అక్కివరం పంచాయతీ, తోటాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 121లో ఉన్న సుమారు 200 ఎకరాల భూమి జిరాయితీ భూమి అని జిల్లా కోర్టు నుండి సుప్రీంకోర్టు వరకు అన్ని న్యాయస్థానాలు స్పష్టంగా తీర్పులు ఇచ్చాయన్నారు. తహసీల్దార్ నుండి ల్యాండ్ ట్రిబ్యునల్ కౌన్సిల్ వరకు ప్రతి అధికార సంస్థ కూడా ఈ భూములు జిరాయితీ భూములేనని ధృవీకరించిందన్నారు. అయినా కూడా కొంతమంది వైసీపీ నాయకులు రాజకీయ కక్షతో, దోపిడీ ఆశతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్తరోడ్డు జంక్షన్‌లో ఉన్న భూములు బావాజీ మఠానికి చెందినవన్నారు. ఈ భూములు ఎండోమెంట్, దేవదాయ శాఖకు సంబంధించినది కాదని, ఇవి మఠానికి చెందిన ప్రైవేట్ భూములని అన్నారు. ములక్ దాస్ బావాజీ స్థాపించిన ఈ మఠానికి చాలామంది ఆస్తిని దానంగా ఇచ్చారన్నారు. దేశం నలుమూలల నుండి వచ్చే స్వామీజీలు, బావాజీలు, సన్యాసులకు వసతి కల్పించడం, హిందూ ఆచారాలను ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేయడం కోసం ఈ భూములు తరతరాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. అక్కడ ఇళ్లు కట్టుకున్న సామాన్య ప్రజలను వేధించి డబ్బులు దండుకోవాలని కొందరు చూస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో తనకు భూములు ఉన్నాయని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే నిరూపించాలని కూన రవికుమార్ సవాల్ విసిరారు. నేను ఆ ప్రాంతానికి వెళ్లిన ప్రతిసారి అక్కడి ప్రజలు 'మాకు రోడ్లు లేవు... కాలువలు లేవు... వర్షం పడితే పిల్లలు స్కూల్‌కు వెళ్లలేని పరిస్థితి' అని లిఖిత పూర్వక వినతులు ఇచ్చారన్నారు. గ్రామ సభ పెట్టి తీర్మానం చేసిన తర్వాత ప్రజల కోరిక మేరకు రోడ్లు వేశామన్నారు. ఇది నా వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదని, ప్రజల అవసరాల కోసమేనన్నారు. తాను నియోజకవర్గ అభివృద్ధికి చేసిన పనులను గుర్తుచేస్తూ, నియోజకవర్గం మొత్తం మీద సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేశామన్నారు. గత ప్రభుత్వానికి చేతకాని పనులను పూర్తి చేశామని చెప్పారు.



గత వైసీపీ ప్రభుత్వం ఒక కిలోమీటర్ కూడా పూర్తి చేయలేని రోడ్లను మేము పూర్తి చేశామని తెలిపారు. దాదాపు 78 కిలోమీటర్ల రోడ్లను రూ.800 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. కొత్తరోడ్డు ప్రాంతంలో ఇప్పటివరకు వేసిన సీసీ రోడ్ల ఖర్చు కేవలం నలభై లక్షల రూపాయలు మాత్రమేనని, ఇంకా మిగిలిన నిధులతో పెండింగ్‌లో ఉన్న రోడ్లను కూడా పూర్తి చేస్తామన్నారు. రైతులు తమ అవసరాల కోసం అమ్ముకున్న భూముల్లో వాళ్లే వేసుకున్న కచ్చా రోడ్లను వేసుకున్నారని, గ్రామస్తుల అభ్యర్థన మేరకు సీసీ రోడ్లుగా మార్చామన్నారు. దీనిని కూడా రాజకీయ రంగు పులిమి దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ప్రజల సౌకర్యం కోసం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడ ప్రజలు మీ బెదిరింపులకు భయపడరని, తోటాడ, అక్కివరం రైతులకు అండగా ఉంటానన్నారు. త్వరలోనే ఇనిషియల్ సర్వేకు నోటిఫికేషన్ వస్తుందని, రైతులందరికీ హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుండి ఈరోజు వరకు ఏ నాయకుడు చేయని సర్వేను నేను చేయించి రైతులకు హక్కులు ఇప్పిస్తానన్నారు. కొత్తరోడ్డులో ఉన్న బాబాజీ మఠం భూములకు, ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అవి పూర్తిగా ప్రైవేట్ మఠం భూములని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇటువంటి 420 రాజకీయాలు చేసి నా ఇమేజ్ డ్యామేజ్ చేయాలని చూస్తే ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు. వైసీపీని ప్రజలు ఫేక్ పార్టీగా చూస్తున్నారని విమర్శించారు. మీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, మీ దోపిడీలు, మీ దౌర్జన్యాలు ప్రజలందరికీ తెలుసున్నారు. నా ముప్పై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడా ఒక్క అంగుళం భూమి కబ్జా చేసిన చరిత్ర లేదని, ఆధారాలు ఉంటే నిరూపించాలని కూన రవికుమార్ సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరికీ రాజకీయంగా, చట్టపరంగా తగిన సమాధానం ఇస్తానని హెచ్చరించారు. సమావేశంలో తోటాడ, అక్కివరం రైతులు, కొత్తరోడ్డు జంక్షన్, వెంకటేశ్వర కాలనీవాసులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు



**సారవకోట, మే 17 (వార్త):** సారవకోట మండలంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అన్ని విధాల కృషి చేస్తున్నట్లు మద్దు వెంకటరమణ మూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని మాలువ పాఠశాలలో "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం 398 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరదగిన పిల్లలను గుర్తించి ఇప్పటి వరకు సుమారు 196 మంది విద్యార్థులను ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి చిన్నారి విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలల ద్వారానే మెరుగైన దిశగా సాగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

# వితంతువులకు భరోసా!

- జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు
- గత ఐదేళ్లలో అటకెక్కిన ఎత్తిపోతల పథకాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- నిమ్మాడలో ప్రజాదర్బార్



**శ్రీకాకుళం/నిమ్మాడ, మే 17(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, జూన్ 12న అర్హులైన వితంతువులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో సంతబొమ్మాళి మండలం ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించిన మంత్రి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 'ఎన్టీఆర్ భరోసా' కింద వితంతువులకు నెలకు రూ. 4,000 అందిస్తున్నామని అన్నారు. త్వరలోనే అర్హత ఉన్నవారు నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరి విన్నపాన్ని సావధానంగా విన్న అనంతరం, ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు మరియు సేవలు అందేలా చూస్తామని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ప్రజలకు భరోసా కల్పించారు. రైతులకు ప్రభుత్వం సబ్సీడిపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందిస్తోందని, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సబ్‌రిజస్ట్రార్ కార్యాలయాల్లో 18 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని వినతపత్రం అందించారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతులు వినతపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లిఫ్ట్ ఇరిగేషన్లను ఐదేళ్లు పట్టించుకోలేదని విమర్శించారు. త్వరలో వాటన్నింటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అచ్చెన్నాయుడు అన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలి

**కంచిలి, మే 17 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కంచిలి మండలంలో కూటమి విజయాలతో తన సత్తా చాటాలని మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు పిలుపునిచ్చారు. తెలుగుదేశం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆదివారం కంచిలిలో భారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల కాలంలో మండలంలో ప్రతి గ్రామాన్ని గుర్తించి వివిధ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి సాధిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. రానున్న కాలంలో మండలంలో మరింత ప్రగతిని సాధించి కంచిలి మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం అని అన్నారు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికలు మన పార్టీలకు ఎంతో కీలకమని నొక్కి చెప్పారు. ప్రతి పంచాయతీ గెలవాలని కోరారు. సర్పంచు ఎంపీటీసీ ఎంపీపీ జడ్పిటిసి వంటి స్థానాల్లో కూటమి పార్టీల జెండాలు రెపరెపలాడాలని పేర్కొన్నారు. ఇప్పటినుంచి నాయకులు కార్యకర్తలు ఐక్యతగా పనిచేసే రానున్న ఎన్నికలను సవాల్ గా స్వీకరిద్దామని రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు పైల పురుషోత్తం, డొక్కరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## ఎయిడ్స్ బాధితుల కోసం
# కొవ్వొత్తుల ర్యాలీ

**ఇచ్ఛాపురం, మే 17 (వార్త):** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సలహా మేరకు హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి తో బాధపడుతూ చనిపోయిన వారిని ఆత్మ శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవేందర్ రెడ్డి ప్రతి ఒక్కరూ హెచ్ఐవి స్థితి తెలుసుకోవాలని, హెచ్ఐవి ఉన్నవారు ఏ ఆర్ టి మందులు సక్రమంగా వాడి వారి యొక్క జీవితకాలం పొడిగించుకోవాలని, వారి పట్ల ప్రేమ అభిమానంతో చూడాలని, ఎటువంటి వివక్ష త లేకుండా చూడాలని కోరారు. ఇటువంటి సలహాలు సందేహాలు కావాలంటే హాస్పిటల్ నందు ఉచిత కౌన్సిలింగ్ , టెస్టింగ్ చేసి గోప్యత పాటించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బమ్మిడి గౌతమి ఐసీటీసీ కౌన్సిలర్ బమ్మిడి రాజశేఖర్ హెడ్ నర్స్ భవాని ఇతర వైద్య సిబ్బంది గెస్ట్ టిఐ ఎన్జీవో సిబ్బంది, ఇతర టి ఐ ప్రాజెక్ట్ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో..
# ప్రైవేట్ పార్కింగ్!

**సోంపేట, మే17 (వార్త):** సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి.. ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. అనునిత్యం ప్రైవేట్ వ్యక్తులకు చెందిన కార్లు, అంబులెన్స్ వాహనాలు ఇతరత్రా వాహనాలు ఆసుపత్రి ఆవరణలోనే పార్కింగ్ చేయడం గమనార్హం. ఇప్పటికే ఆసుపత్రికి చెందిన రెండు అంబులెన్సులు, అలాగే ప్రస్తుతానికి సొంత నీడలేని అగ్నిమాపక శకటం ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఉంటున్నాయి. వీటికి అదనంగా ప్రైవేటు వాహనాలు కూడా ఇక్కడే పార్క్ చేయడంతో ఆవరణ మొత్తం వాహనాలతో నిండిపోతుంది. ప్రైవేటు వాహనాలను ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ చేయడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## అండమాన్‌లో తెలుగువారి అభ్యున్నతికి సహకరించండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి వినతి

**సోంపేట, మే 17(వార్త):** అండమాన్ నికోబార్ దీవుల్లో నివసిస్తున్న తెలుగు ప్రజల సంక్షేమానికి అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ద్వారా తగు సహాయ సహకారాలు అందించేందుకు చొరవ చూపాలని కోరుతూ అండమాన్ దీవుల జాయింట్ యాక్షన్ తెలుగు కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శి బైపల్లి హేమరాజ్‌తో పాటు సోంపేటకు చెందిన పలువురు టిడిపి నేతలు ఆదివారం శ్రీకాకుళంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. పోర్ట్ బ్లేయర్‌ను విశాఖలో ఉన్న అండమాన్ భవనం 1000 చదరపు మీటర్ల పర్మినెంట్ ల్యాండ్‌ను అండమాన్ యాజమాన్యానికి అప్పగించాలని కోరారు. తద్వారా విశాఖలో మంచి భవనం నిర్మించి తెలుగువారికి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అండమాన్‌లో తెలుగు వారి కోసం పోరాటం చేసి పోలీస్ కేసుల్లో ఇరుక్కున్న తెలుగువారిని వెంటనే తప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దు కుమార్ బడే తమ్మారావు వంక మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనలో.. జిల్లాకు వరాలేవి?

- మోసగించడంతో చంద్రబాబు దిట్ట
- వైసీపీని విమర్శించడమే అతని పని
- రైతు సమస్యలపై స్పందించని ప్రభుత్వం
- సీఎం పర్యటన అట్టర్ ఫ్లాప్
- అంతా ప్రచార ఆర్భాటమే
- వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



**నరసన్నపేట, మే 17 (వార్త):** సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా పర్యటనతో జిల్లావాసులకు వరాలు వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఆదివారం నరసన్నపేట వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలోనే శ్రీకాకుళం జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. కిడ్నీ సెంటర్ ఏర్పాటు, మూలపేట పోర్టు అభివృద్ధి, ఉద్దానం ప్రాంతానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలిపారు. దీర్ఘకాలం అధికారంలో ఉన్న టీడీపీ జిల్లాకు చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఇటీవల నరసన్నపేట పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు భారీ వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశించారని, కానీ చివరకు నిరాశే మిగిలిందన్నారు. సీఎం పర్యటన ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని, ప్రజా సమస్యలపై స్పందించలేదన్నారు. కేవలం వైసీపీని విమర్శించడానికే పనికివచ్చిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా సీఎం ప్రస్తావించలేదని విమర్శించారు. సీఎం పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. ఈ సమావేశంలో పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఢిల్లీ జన్మదిన వేడుకలు

**ఇచ్ఛాపురం, మే 17 (వార్త):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీనియర్ తెలుగుదేశం నాయకులు సాలీన ఢిల్లీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక అర్ జే ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ కేక్ కట్ చేసి తినిపించారు. వేడుకలు కి పెద్ద ఎత్తున జిల్లా పార్టీ నాయకులు బి సి నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య, కాళ్ల జై దేవ్, కాళ్ల దిలీప్, నందికి జానీ, కొర్రయు వాసు ధర్మరాజు, జానీ, శ్రీను, కోటి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా



**కంచిలి, మే 17 (వార్త):** కంచిలి మండలం బూరగాం గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి వరద కాలువలో బోల్తా పడింది. సుమారు 40 మంది యాత్రికులు అనంతపురం నుంచి కాశీ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, గైడ్ కు చిన్నపాటి గాయాలు కాగా, ప్రయాణికులందరూ క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## రక్తదానంతో ఆదుకున్న యువకుడు



**ఇచ్ఛాపురం, మే 17 (వార్త):** రక్తదాన కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం మండలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమవడంతో ఖగేశ్వర్ బేహరా అనే యువకుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఈదుపురం గ్రామానికి చెందిన ఖగేశ్వర బెహరా ను హంగీర్ బెహరా ఆధ్వర్యంలో యువకుడిని ఆసుపత్రికి తీసుకువెళ్లి రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన ఖగేశ్వర బెహరాకు హంగీర్ బెహరా, జిత్తు బెహరా, సీమాచలో బెహరా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

## వైభవంగా తులసమ్మ సంబరం



**ఇచ్ఛాపురం, మే17 (వార్త):** లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ అమ్మవారి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. స్వర్ణ భారతీ విద్యా సంస్థలు చైర్మన్ చాట్ల తులసీదాసు రెడ్డి మాజీ ఏ ఎం సి చైర్మన్ చాట్ల సుజాత రెడ్డి దంపతులు మొక్కుబడులు చెల్లించారు. బెల్లు పడ నుండి సాంస్కృతిక కార్యక్రమాలు తో ఊరేగింపు గా సంబరం సాగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నీరు లేక వెలవెలబోతున్న పశువుల తొట్టెలు



**సారవకోట, మే 17 (వార్త):** వేసవి కాలంలో పశువుల దాహం తీర్చేందుకు సారవకోట మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన నీటి తొట్టెలు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నాయి. దీంతో మండలంలోని మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ తొట్టెల్లో క్రమం తప్పకుండా నీరు నింపాల్సి ఉన్నప్పటికీ కిడిమి, గొర్రిబంద, భద్రాచలం, బుడితి గ్రామాల్లో ఏర్పాటు చేసిన తొట్టెలు ఖాళీగా కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మండలంలోని చెరువులు అడుగంటిపోవడంతో పశువులకు తాగునీటి కొరత ఏర్పడిందని, మరోవైపు నీటి తొట్టెల్లో కూడా నీరు లేకపోవడంతో ఎండల తీవ్రతకు మూగజీవాలు అలమటిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తొట్టెల్లో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. వేసవి ముగిసే వరకు పశువులకు తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546